# ఇంజినీర్లూ.. ఇవిగో కొలువులు!

**వివిధ ప్రభుత్వ శాఖల్లోని ఇంజినీరింగ్ సర్వీసుల్లో ఏఈఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ వెలువరించింది. తెలుగు రాష్ట్రాల ఇంజినీరింగ్ పట్టభద్రులు వీటికి దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రిలిమ్స్, మెయిన్స్‌లో జనరల్ స్టడీస్ కామన్‌గా ఉంది. టెక్నికల్ సబ్జెక్టుపై పట్టుసాధిస్తే కొత్త సంవత్సరంలో సర్కారీ కొలువులో ఉత్సాహంగా చేరిపోవచ్చు.**

ఏపీపీఎస్సీ 309 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) పోస్టుల భర్తీకి సిద్ధమైంది. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పట్టభద్రులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగ ప్రకటన ఇది! నెలకు దాదాపు రూ. 60,000 జీతభత్యాలు లభిస్తాయి.

## మౌలికాంశాలపైనే టెక్నికల్ ప్రశ్నలు

గతంలో ఏపీపీఎస్సీ ఈ పరీక్షను 2016 నవంబరులో నిర్వహించింది. దానిలో పూర్తి సిలబస్‌తో కూడిన సివిల్, మెకానికల్ పరీక్షను నిర్వహించారు. నేడు సివిల్, మెకానికల్ బ్రాంచీలకు ఒకే సిలబస్, పార్ట్-ఎ, బిల్లో ఇచ్చారు. ఈ రెండు బ్రాంచీలకు జనరల్ స్టడీస్‌తోపాటు స్ట్రెంత్ ఆఫ్ మెటీరియల్, ఫ్లూయిడ్ మెకానిక్స్ అండ్ మెషినరీ మాత్రమే ఉన్నాయి. సాధారణంగా ఉండే ఇతర 10 నుంచి 12 టెక్నికల్ సబ్జెక్టులు ప్రిలిమినరీలో లేవు. ఇవి మెయిన్స్‌లో పేపర్-3గా ఉంటాయి. ఎలక్ట్రికల్ విభాగానికి ప్రిలిమినరీలో సర్క్యూట్ థియరీ, మెజర్‌మెంట్స్, పవర్ సిస్టమ్స్, మెషిన్స్ ఉన్నాయి.

**ప్రశ్నల సరళి:** టెక్నికల్ సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు ఎక్కువగా ప్రాథమికాంశాలపై ఉంటున్నాయి. న్యూమరికల్ ప్రశ్నలు 15 నుంచి 20 శాతం మాత్రమే ఉండొచ్చు. చాలావరకు ఫార్ములా ఆధారిత, సబ్‌స్టిట్యూషన్ ఆధారితంగా ఉండవచ్చు. ఈ ప్రశ్నలకు కాల్‌క్యులేటర్ అవసరం ఉండదు. గతంలో ప్రశ్నల నిడివి 1 నుంచి 3 లైన్లు మాత్రమే ఉన్నాయి. చాలా ప్రశ్నలకు చూడగానే సమాధానం కనుక్కోవచ్చు. అయితే సిలబస్ నలుమూలల నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది.

ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలంటే నవంబరు 29, 2018 నాటికి బీఈ/ బీటెక్ (సివిల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్) లేదా తత్సమాన విద్య పూర్తిచేసుండాలి. వీరి వయసు 01. 07. 2018 నాటికి 18 నుంచి 42 ఏళ్లు ఉండాలి. దరఖాస్తుకు చివరితేదీ 24 డిసెంబరు, 2018.

## రాతపరీక్ష ఏ విధంగా?

25,000 కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే ప్రిలిమినరీ ఆన్‌లైన్‌లో జరుగుతుంది. దీన్ని ఫిబ్రవరి 10, 2019న నిర్వహించనున్నారు. మెయిన్స్ పరీక్షకు షార్ట్‌లిస్ట్ చేయడానికి మాత్రమే దీన్ని ఉపయోగిస్తారు. ఈ పరీక్షలో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు. రుణాత్మక మార్కులుంటాయి. ప్రిలిమినరీ పరీక్ష రెండు విభాగాల్లో 150 ప్రశ్నలతో 150 మార్కులకు ఉంటుంది. కాలవ్యవధి 150 నిమిషాలు. పార్ట్-ఎ లో జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ, పార్ట్-బి లో సివిల్ అండ్ మెకానికల్ (కామన్ పేపర్)/ ఎలక్ట్రికల్ ఉంటాయి.


**వై.వి. గోపాలకృష్ణమూర్తి**
ఎండీ, ఏస్ ఇంజినీరింగ్ అకాడమీ

## రెండు జీఎస్‌లకు ఒకటే సిలబస్

ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటికీ జనరల్ స్టడీస్ సిలబస్ ఒకటే ఉంది. ప్రాథమిక పరీక్ష అయిన ప్రిలిమ్స్‌లో ఇచ్చే 50 ప్రశ్నల్లో ఎక్కువగా వర్తమానాంశాలు, జాగ్రఫీ నుంచి ప్రశ్నలు వస్తున్నాయి.

**భారత్, ఏపీ జాగ్రఫీ:** దీని నుంచి ప్రిలిమ్స్, మెయిన్స్‌ల్లో ఎక్కువగా ప్రశ్నలు వస్తాయి. ముఖ్యంగా భారతదేశ భౌగోళిక లక్షణాలు, ఖనిజ వనరులు,



రవాణా, అడవులు, జనాభా మీద ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి నదీ జలాల సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కొత్త ప్రాజెక్టులపై అడిగే అవకాశం ఉంది.

**కరెంట్ అఫైర్స్:** ప్రిలిమ్స్‌లో జాతీయ, ప్రాంతీయ అంశాల నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. మెయిన్స్‌లో అంతర్జాతీయ అంశాల నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పథకాలు, ముఖ్యమైన అవార్డులు, వ్యక్తులు, నూతన శాస్త్ర సాంకేతిక అంశాలపై దృష్టి పెట్టాలి.

**ఇండియన్ పాలిటీ అండ్ గవర్నెన్స్:** ఇది వర్తమానాంశాలతో ముడిపడి ఉంటుంది. ముఖ్యమైన రాజ్యాంగ సవరణలు, అధికరణలు, షెడ్యూల్స్, ఎలక్షన్ కమిషన్, నీతి ఆయోగ్, పంచాయతీరాజ్ వ్యవస్థ, పార్లమెంటరీ వ్యవస్థ, న్యాయవ్యవస్థ, డిజిటల్ పరిపాలన విధానాలపై దృష్టిపెట్టాలి.

వీటితోపాటు డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా జాతీయ విపత్తు నిర్వహణ చట్టం-2005, విపత్తు నిర్వహణ సంస్థలు, సహజ విపత్తులు, మానవ కారక విపత్తుల తదితరాలపై ప్రశ్నలు వస్తాయి. సస్టెయినబుల్ డెవలప్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్‌కి సంబంధించి గ్లోబల్ వార్మింగ్, ఓజోన్ పొర క్షీణత, జల కాలుష్యం, వాయు కాలుష్యం, నేల కాలుష్యం- క్షీణత, అడవుల నాశనం మొదలైనవాటిపై దృష్టిపెట్టాలి. జనరల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో విటమిన్లు, వాటి ప్రయోజనాలు, ఖనిజ వనరులు, వ్యాధులు, శాస్త్రసాంకేతిక రంగంలో భారతదేశ ప్రగతి ముఖ్యంగా జీఎస్ఎల్వీ, పీఎస్ఎల్వీ, శాటిలైట్ల ప్రయోగం, న్యూక్లియర్ టెక్నాలజీ మీద ఎక్కువ ప్రశ్నలు వస్తాయి. అభ్యర్థులు ప్రధానంగా దృష్టిపెట్టాల్సిన మరో విభాగం ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యలు. ఇందులో కొత్త రాజధాని నిర్మాణం- సవాళ్లు, నదీజలాల సమస్యలు, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం మొదలైనవి ముఖ్యం. స్వాతంత్ర్యానంతరం భారత్, ఆంధ్రప్రదేశ్‌ల్లో జరిగిన ఆర్థికాభివృద్ధిని ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి. లాజికల్ రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీ అండ్ డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా అనాలిసిస్‌లో ట్యాబ్‌లేషన్ డేటా, విజువల్ రిప్రజంటేషన్ ఆఫ్ డేటా, బేసిక్ డేటా ఆఫ్ అనాలిసిస్ ప్రశ్నలుంటాయి.

(దరఖాస్తు ప్రక్రియ, మెయిన్స్ ప్రిపరేషన్ విధానం, ఇతర సూచనలను http://tinyurl.com/yctsk8ce లింక్‌లో లేదా www.eenadupratibha.netలో చూడవచ్చు.)